# తీహార్ జైలుకు కేజ్రీవాల్

- 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ
- ప్రధాని మోదీ చేస్తున్నది.. ఈ దేశానికి మంచిది కాదు
- కోర్టులోకి వెళ్లే ముందు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ఢిల్లీ మద్యం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు స్థానిక రౌస్ అవెన్యూ కోర్టు ఈనెల 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కేజ్రీవాల్ విడుదలయితే కేసు దర్యాప్తునకు అటంకం కలిగే అవకాశం ఉందన్న ఈడీ వాదనను పరిగణనలోకి తీసుకొన్న జడ్జి కావేరీ భవేజా ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం అధికారులు కేజ్రీవాల్‌ను తీహార్ జైలుకు తరలించారు. సోమవారంతో ఈడీ కస్టడీ ముగియటంతో అధికారులు కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపరిచారు. విచారణకు కేజ్రీవాల్ సహకరించడం లేదని, ప్రశ్నలకు సమాధానాలు దాటవేస్తున్నారని ఈడీ తరఫు న్యాయవాది వాదించారు. విజయ్ నాయర్ అనే వ్యక్తి తనతో మాట్లాడలేదని, మంత్రులు ఆతిశీ, సౌరవ్ భరద్వాజ్‌లతో మాట్లాడారని కేజ్రీవాల్ విచారణలో చెప్పారని ఈడీ రిమాండ్ అప్లికేషన్‌లో పేర్కొన్నది.



రౌస్ అవెన్యూ కోర్టు విచారణకు వస్తున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

### కేజ్రీవాల్ పిటిషన్‌పై రేపు విచారణ

తనను ఈడీ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ సీఎం కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు బుధవారం విచారించనున్నది. జైలుకు వెళ్లిన ఆప్ నేతల్లో కేజ్రీవాల్ నాలుగో వ్యక్తి కావడం గమనార్హం. అంతకుముందు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థలు పలు కేసుల్లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, అంతకుముందు కోర్టులోకి ప్రవేశించే ముందు కేజ్రీవాల్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తన అరెస్టును ఉద్దేశించి మాట్లాడుతూ 'ప్రధానమంత్రి చేస్తున్నది... ఈ దేశానికి మంచిది కాదు' అని వ్యాఖ్యానించారు. కోర్టుకు కేజ్రీవాల్ భార్య సునీతతోపాటు ఢిల్లీ మంత్రులు ఆతిశీ, సౌరవ్ భరద్వాజ్ హాజరయ్యారు.

### ఆయనే సీఎంగా కొనసాగుతారు: ఆప్

కేజ్రీవాల్‌ను ఎంతకాలం జైల్లో ఉంచినప్పటికీ, ఢిల్లీ సీఎంగా ఆయనే కొనసాగుతారని ఆప్ నేత జాస్మిన్ షా పేర్కొన్నారు. సీఎంగా ఢిల్లీ ప్రజలకు సేవ చేసేందుకు ఆయన రాజ్యాంగబద్ధంగా ప్రమాణస్వీకారం చేశారని, అది ఆయన బాధ్యత అని అన్నారు. జాస్మిన్ షా సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మద్యం పాలసీ కేసులో ఆతిశీ, భరద్వాజ్ పేర్లను తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్‌ను ఖతం చేయాలంటే కేజ్రీవాల్‌ను మాత్రమే జైలుకు పంపిస్తే సరిపోదని బీజేపీ భావిస్తున్నదని ఆరోపించారు. మరోవైపు రానున్న రోజుల్లో పార్టీలో కేజ్రీవాల్ భార్య సునీత కీలక పాత్ర పోషించనున్నారని ఆప్ వర్గాలు పేర్కొన్నాయి.

## న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో రూ.25 లక్షల చెట్టు!



న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లోని ఓ చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది. భారతీయ రైల్వే థాయ్‌లాండ్ నుంచి ఈ చెట్టును తెప్పించి ఇక్కడ నాటించింది. దీని ఖరీదు అక్షరాలా రూ.25 లక్షలు. ఎంపీలు, ఎమ్మెల్యేలు వంటి వీఐపీలు ప్రవేశించే మార్గంలోఈ చెట్టును నాటారు. దీనికి నెలకు రూ.2,500 విలువైన ప్రొటీన్లను, రూ.5,000 విలువైన ఎరువులు, నీటిని అందజేయవలసి ఉంటుంది.

## రాయితీ ఎత్తివేతతో రైల్వేకు కాసుల పంట

### గత నాలుగేండ్లలో 5,800 కోట్ల అదనపు ఆదాయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: సీనియర్ సిటిజన్లకు రాయితీల ఎత్తివేత రైల్వేకు కాసుల వర్షం కురిపించింది. గత నాలుగేండ్లుగా ఆ శాఖకు అదనంగా రూ.5,800 కోట్ల ఆదాయం సమకూరింది. ఆర్‌టీఐ చట్టం ద్వారా ఈ విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా కొవిడ్ ప్రారంభమైన 2020 మార్చి 20న వృద్ధులకు అప్పటివరకు రైలు టికెట్ చార్జీలపై ఇస్తున్న రాయితీని ఎత్తివేస్తున్నట్టు రైల్వే మంత్రి ప్రకటించారు. అంతకుముందు సీనియర్ సిటిజన్ కోటాలో మహిళలకు 50 శాతం, పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు 40 శాతం టికెట్ చార్జీలో రాయితీ ఇచ్చేవారు. సబ్సిడీ ఎత్తివేతపై ఎంపీకి చెందిన చంద్రశేఖర్ ఆర్‌టీఐ చట్టం కింద వివరాలు సేకరించగా, 2020, మార్చి 20 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు రైల్వేకు అదనంగా 5,875 కోట్ల ఆదాయం సమకూరినట్టు వెల్లడైంది.




## జర్మనీలో దమ్ మారో దమ్

### గంజాయికి చట్టబద్ధత

ఫ్రాంక్‌ఫర్ట్: మత్తు పదార్థాలను సేచ్ఛగా తీసుకోవడానికి జర్మనీ గేట్లను బార్లా తెరిచింది. కొద్ది మొత్తంలో గంజాయిని కలిగి ఉండటాన్ని చట్టబద్ధం చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. దీంతో గంజాయి అసోసియేషన్ ఈ నూతన చట్టంపై ప్రచారాన్ని సైతం ప్రారంభించింది. బెర్లిన్‌లోని బ్రాండెన్‌బర్గ్ గేట్ వద్ద ఈ చట్టం అమలులోకి వచ్చిన సోమవారం అర్ధరాత్రి 'స్మోక్ ఇన్' కార్యక్రమాన్ని నిర్వహించి దమ్ మారో దమ్ అంటూ గంజాయి ప్రియులను మత్తులో ముంచెత్తింది. జర్మనీలో అమలులోకి వచ్చిన నూతన చట్టం ప్రకారం పెద్దలు సుమారు 25 గ్రాముల గంజాయిని వినోదం కోసం తమ వద్ద ఉంచుకోవచ్చు. అంతే కాకుండా ప్రతి వ్యక్తి మూడు గంజాయి మొక్కల వరకు సొంతంగా పెంచుకోవచ్చు. 18 ఏండ్లు పైబడిన వ్యక్తులు లాభేతర గంజాయి క్లబ్‌లలో చేరడానికి అనుమతి ఇచ్చారు. అయితే ఈ క్లబ్ సభ్యుల సంఖ్య 500కు మించరాదు. వ్యక్తిగతంగా రోజుకు 25 గ్రాములు, గరిష్టంగా నెలకు 50 గ్రాముల గంజాయి కొనుక్కోవచ్చు.

## 'అరుణాచల్' ప్రాంతాలకు చైనా మళ్లీ కొత్త పేర్లు

బీజింగ్, ఏప్రిల్ 1: అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగమంటూ చైనా తన స్వరం పెంచుతున్నది. తాజాగా అక్కడ 30 ప్రాంతాలకు కొత్త పేర్లను పెడుతూ నాలుగో జాబితాను ఆదివారం విడుదల చేసింది. చైనా పౌర వ్యవహారాల శాఖ అధికారిక వెబ్‌సైట్ దీనిపై ఒక ప్రకటన విడుదల చేసింది. 'ప్రాంతాల పేర్లు విదేశీ భాషలో ఉండటం చైనా ప్రాదేశికతకు హాని కలిగించవచ్చు. చైనా సార్వభౌమత్వ హక్కులను నేరుగా ప్రస్తావించకూడదు, అధికారం లేకుండా అనువాదం చేయకూడదు' అని ఆ ప్రకటన తెలిపింది. భారత ప్రధాని మోదీ ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లో సైనికులను వేగంగా తరలించేందుకు ఉపయోగపడే సేలా సొరంగాన్ని జాతికి అంకితం చేసిన నేపథ్యంలో చైనా ఈ ప్రకటన విడుదల చేసింది. చైనా నాలుగో జాబితాను భారత్ ఖండించింది. అరుణాచల్ తమ దేశ అంతర్భాగమని.. పేర్లను మార్చడం ద్వారా వాస్తవాలను మరుగుపరచలేరని స్పష్టం చేసింది.

## బీజేపీలో చేరితే 25 కోట్లు ఇస్తామన్నారు

### 10 మంది ఎమ్మెల్యేలనూ తెమ్మన్నారు
### ఆప్ శాసనసభ్యుడి తీవ్ర ఆరోపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ఢిల్లీ అసెంబ్లీలో అధికార ఆప్ ఎమ్మెల్యే రితురాజ్ ఝా సోమవారం కేంద్రంలోని బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆప్ పార్టీని వీడి తనతో పాటు మరో 10 మంది ఎమ్మెల్యేలను తెచ్చి బీజేపీలో చేర్పితే ఒక్కొక్కరికీ రూ.25 కోట్లు చొప్పున ఇవ్వడంతో పాటు తనకు మంత్రి పదవి కూడా ఇస్తానని ఆఫర్ ఇచ్చారని చెప్పారు. ఇలాంటి చీప్ ట్రిక్కులతో ఆప్‌ను విచ్ఛిన్నం చేయడానికి బీజేపీ ఎత్తులు వేస్తున్నదని ఆయన విమర్శించారు. ఆదివారం ఇండియా మహార్యాలీలో పాల్గొన్న అనంతరం ఒక వివాహానికి హాజరయ్యానని, అంతకు ముందు మూడు నాలుగు రోజుల నుంచి ఫోన్ ద్వారా తనతో మాట్లాడటానికి ప్రయత్నించిన నలుగురు వ్యక్తులు ఈ 25 కోట్ల ప్రతిపాదన తెచ్చారన్నారు. ఈ ఆరోపణలను బీజేపీ ఎమ్మెల్యే విజేందర్ గుప్తా తీవ్రంగా ఖండించారు.




## ముందు మీ భార్యల చీరలు తగలబెట్టండి

### బాయ్‌కాట్ ఇండియా నిరసనకారులకు హసీనా కౌంటర్



హసీనా

ఢాకా, ఏప్రిల్ 1: దేశంలో భారత వ్యతిరేక సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతలపై బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌ను తర్వాత వ్యతిరేకించవచ్చు కానీ, తొలుత మీ భార్యలు కట్టుకున్న భారత చీరలను తగలబెట్టాలని సూచించారు. జనవరిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హసీనా వరుసగా నాలుగోసారి ప్రధానిగా ఎన్నికయ్యారు. దీన్ని జీర్ణించుకోలేకపోతున్న ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) 'బాయ్‌కాట్ ఇండియా' ఉద్యమాన్ని లేవనెత్తింది. హసీనా భారత అనుకూలవాది అని, ఆమె గెలుపులో భారత్ హస్తముందని ఆరోపించింది. బంగ్లాదేశ్ ప్రజలకు ఎన్నడూ మద్దతివ్వని భారత్.. అవామీ లీగ్ (హసీనా పార్టీ)కి మాత్రం మద్దతు ఇస్తోందని, ప్రజల ఆగ్రహానికి ఇదే కారణమని బీఎన్‌పీ నాయకుడు రాహుల్ కబీర్ రిజ్వీ ఆరోపించారు. భారత్‌పై ప్రతిపక్షాల రెచ్చగొట్టే వ్యాఖ్యలను ప్రధాని హసీనా తిప్పికొట్టారు. బీఎన్‌పీ నేతలు నిజంగా భారత ఉత్పత్తులను బహిష్కరించాలనుకుంటే తొలుత వారి భార్యలు కట్టుకొనే భారత చీరలను తగలబెట్టాలని అన్నారు.


## ఇమ్రాన్‌ఖాన్‌కు భారీ ఊరట

### తోషాఖానా కేసులో శిక్ష రద్దు

ఇస్లామాబాద్, ఏప్రిల్ 1: తోషాఖానా అవినీతి కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఇమ్రాన్‌కు, ఆయన భార్య బుస్రా బీబీకి విధించిన 14 ఏండ్ల జైలు శిక్షను హైకోర్టు సోమవారం రద్దు చేసింది. ఈ కేసులో ఇమ్రాన్ దంపతులిద్దరికీ ఈ ఏడాది జనవరి 31న 14 ఏండ్ల చొప్పున జైలు శిక్ష విధించడంతో వారు శిక్ష అనుభవిస్తున్నారు. తమకు విధించిన శిక్షను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన ఇస్లామాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ అమీర్ ఫరూక్ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల ధర్మాసనం వారికి తాత్కాలిక ఊరట కలిగించింది. వారిద్దరికీ విధించిన శిక్షను రద్దు చేస్తూ బెయిల్ మంజూరు చేసింది. అయితే శిక్షకు వ్యతిరేకంగా వారు దాఖలు చేసిన పిటిషన్లను ఈద్ పండుగ తర్వాత వచ్చే నెల విచారిస్తామని తెలిపింది. కాగా, శిక్ష రద్దు చేసినా ఇమ్రాన్ దంపతులిద్దరూ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం లేదు. ఎందుకంటే ఇమ్రాన్, బుస్రా కూడా వేరే కేసుల్లో జైలు శిక్షను అనుభవిస్తున్నారు.

## నేతాజీ మృతిపై పిల్.. సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణంపై నిజాలు నిగ్గు తేల్చాలంటూ ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) సుప్రీం కోర్టులో దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం పిటిషనర్ పినాక పాణి మొహంతిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుతం జీవించి లేని నేతలపై నిర్లక్ష్యంగా, బాధ్యతారాహితంగా ఆరోపణలు చేశారని, మహాత్మా గాంధీని కూడా విడిచిపెట్టలేదని మండిపడింది. తాను వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ (ఇండియా) కటక్ జిల్లా కార్యదర్శినని పినాక పాణి ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ''మీ వెనుక ఎవరున్నారు? సమాజానికి, మరీ ముఖ్యంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం మీరు ఏం చేశారు? మీ చిత్తశుద్ధిని పరీక్షించాలి. నాలుగు వారాల్లోగా ఈ వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయండి'' అని పిటిషనర్‌ను ఆదేశించింది.



## జ్ఞానవాపిలో పూజలపై స్టేకు సుప్రీంకోర్టు నో

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో హిందూ దేవతలకు జరుగుతున్న పూజలను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. వ్యాస్ జీ కా తెహఖానా (జ్ఞానవాపి మసీదులోని దక్షిణ నేల మాళిగ)లో పూజలు చేసేందుకు వారణాసి జిల్లా కోర్టు అనుమతించగా, ఆ తీర్పును అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. ఈ హైకోర్టు తీర్పును నిలిపివేయాలని కోరుతూ మసీదు నిర్వహణ కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అందుకు సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది.

## కంచుకోటలో కాంగ్రెస్‌కు ఝలక్

### ఎంపీలో బీజేపీలో చేరిన మేయర్

భోపాల్ : లోక్‌సభ ఎన్నికల్లో కలిసికట్టుగా ప్రజలకు చేరువ కావాల్సిన సమయంలో కాంగ్రెస్ నేతలు ఆ పార్టీకి ఝలక్ ఇస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా మేయర్ విక్రమ్ అహకే సోమవారం బీజేపీలో చేరారు. ఛింద్వారా కాంగ్రెస్ దిగ్గజాల్లో ఒకరైన కమల్‌నాథ్ సొంత జిల్లా కావడంతోపాటు, 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచిన ఏకైక స్థానం ఇదే. అటువంటి ఛింద్వారాలో ఈ పరిణామం జరగడం ఆ పార్టీకి గట్టి ఎదురు దెబ్బగానే చెప్పవచ్చు. విక్రమ్ సోమవారం భోపాల్‌లో ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వీడీ శర్మ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఇదిలా ఉంటే, కమల్‌నాథ్ సన్నిహితుడు, ఛింద్వారా జిల్లా, అమరవాడ ఎమ్మెల్యే కమలేశ్ షా గతవారం బీజేపీలో చేరారు.




## నా క్యారెక్టర్‌కు నాన్న పేరు పెట్టమని చెప్పాను

'ఏ కష్టమొచ్చినా అండగా నిలబడి నేనున్నానంటూ ధైర్యం చెప్పే పర్సన్ ఫ్యామిలీలో ఒకరుంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. మా కుటుంబంలో మా నాన్న ఫ్యామిలీ స్టార్. దర్శకుడు పరశురామ్ ఈ కథ చెబుతున్నప్పుడు మా నాన్న గుర్తొచ్చాడు. అందుకే ఇందులో నా పాత్రకు మా నాన్న పేరు 'గోవర్ధన్' అని పెట్టమన్నాను' అన్నారు విజయ్ దేవరకొండ. ఆయన హీరోగా పరశురామ్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'నా పాత్రకు మా నాన్న పేరు పెట్టుకుంటే ఎమోషన్స్ పలికించడం సులువు అవుతుందని భావించా. ఈ సినిమా కోసం 9 నెలలు వర్క్ చేశా. సంక్రాంతికి రాలేకపోయాం. కానీ ఏప్రిల్ 5 ఫర్‌ఫెక్ట్ డేట్ అనుకుంటున్నాం. రాజుగారి బ్యానర్‌లో 'కేరింత' ఆడిషన్‌కు వెళ్లాను. సెలెక్ట్ కాలేదు. అప్పుడే నేనేంటో ప్రూవ్ చేసుకోవాలనుకున్నా. ఈ సినిమాకు రాజుగారే నాకు చెక్ పంపారు. ఆయనకు ఈ సినిమాతో బిగ్‌హిట్ ఇస్తా.' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'ఈ సినిమాకు విజయ్ క్యారెక్టర్ వెన్నెముక. నవ్విస్తాడు, ఏడిపిస్తాడు, ఫైట్ చేస్తాడు, ఫ్యామిలీ కోసం ఆలోచిస్తాడు. విజయ్ ఈ సినిమాలో 360 డిగ్రీస్ క్యారెక్టర్ చేశాడని చెప్పొచ్చు. ఈ సినిమాలో ముప్పైశాతం ఫ్యామిలీ, డెబ్బై శాతం లవ్‌స్టోరీ ఉంటుంది. మంచి టెక్నికల్ టీమ్ కుదిరింది. మా సంస్థలో ఎన్నో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్ వచ్చాయి. ఒక్క 'శ్రీనివాస కల్యాణం' సినిమా విషయంలో తప్ప నా గురి తప్పలేదు. కుటుంబాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చే వారంతా ఫ్యామిలీ స్టార్స్ అని చెప్పడమే మా సినిమా ఉద్దేశ్యం, విజయ్ దేవరకొండతో భారీ పాన్ ఇండియా సినిమా చేయబోతున్నా. ప్రీ ప్రొడక్షన్స్‌కు టైమ్ పడుతుంది. విజయ్ ప్రొడ్యూసర్స్ హీరో. అందుకే తనతో మరో రెండు సినిమాలు చేస్తా' అని చెప్పారు. మన జీవితాల్లోని ఎమోషన్స్, స్ట్రగుల్స్, అఛీవ్‌మెంట్స్‌ను ప్రతీ ఒక్కరు ఈ సినిమాలో చూసుకుంటారని కథానాయిక మృణాల్ ఠాకూర్ పేర్కొంది.

## భరతనాట్యం అంటే నృత్యం కాదు.. క్రైమ్ వరల్డ్

'భరతనాట్యం' కథకు లాజిక్కులతో పనిలేదు. వినోదం పంచే అన్ని ఎలిమెంట్స్ ఇందులో కుదిరాయి. ఇది హీరోహీరోయిన్ల కథలా ఉండదు. ఈ సినిమా ప్రేరణగా భవిష్యత్తులో కొత్త తరహా పాత్రలు రాయబడతాయి' అంటున్నారు దర్శకుడు కేవీఆర్ మహేంద్ర. ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భరతనాట్యం'. సూర్యతేజ ఏలే, మీనాక్షి గోస్వామి జంటగా నటించారు. పాయల్ సరాఫ్ నిర్మాత. ఈ నెల 5న సినిమా విడుదల కానుంది. దర్శకుడు కేవీఆర్ మహేంద్ర విలేకరులతో ముచ్చటించారు. 'దాదాపుగా ఇరవై నెలలు కష్టపడిస్క్రిప్ట్ తయారు చేశాం. కొత్తవారితో చేసిన సినిమాలా ఉండదు. హిలేరియస్ డార్క్ కామెడీని ప్రేక్షకులు అద్భుతంగా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు మహేంద్ర. ఇంకా చెబుతూ 'భరతనాట్యం ఒక నృత్యకళ. కానీ ఆ పేరుని ఇక్కడ క్రైమ్ వరల్డ్‌కి పెట్టాం. దానికి బలమైన కారణం ఉంది. సాంకేతికంగా అన్ని విధాల సినిమా బావుంటుంది' అని దర్శకుడు తెలిపారు.





చిత్రం

## బన్నీతో జతకట్టనుందా?

అల్లు అర్జున్‌కి జోడీగా త్రిష.. నిజంగా ఇది ఆసక్తికరమైన కాంబినేషనే. కెరీర్ తొలినాళ్లలో ఇద్దరూ చిన్న చిన్న పాత్రలు చేశారు. 2002 డిసెంబర్లో వచ్చిన 'మౌనం పసియాదే'తో త్రిష హీరోయిన్ కాగా, 2003 మార్చిలో వచ్చిన 'గంగోత్రి'తో బన్నీ హీరో అయ్యాడు. రెండు దశాబ్దాలపైన వీరి సినీప్రయాణంలో ఒక్కసారి కూడా జంటగా నటించకపోవడం గమనార్హం. అయితే.. ఇన్నాళ్లకు వీరి కాంబినేషన్ సెట్ అయినట్టు కనిపిస్తున్నది. అట్లీ, అల్లు అర్జున్ కాంబోలో ఓ సినిమా రానుందంటూ వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. స్క్రిప్ట్ వర్క్ కూడా జరుగుతున్నదని సమాచారం. తాజాగా ఈ సినిమాకు చెందిన అప్‌డేట్ చెన్నయ్ సర్కిల్స్‌లో బాగా వైరల్ అవుతున్నది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో త్రిష కథానాయికగా నటించనుందనేది ఈ వార్త సారాంశం. సంప్రదింపులు కూడా జరుగుతున్నాయట. తన రానున్న సినిమాల గురించి అట్లీ చెబుతూ ' మళ్లీ భిన్నమైన కథతో రాబోతున్నాను. కచ్చితంగా సర్‌ప్రైజ్ చేస్తాను' అంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. అట్లీ స్టేట్‌మెంట్ ఈ సినిమా గురించే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## 'దాసి' సుదర్శన్ కన్నుమూత



'దాసి' చిత్రానికిగాను ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా జాతీయ అవార్డు దక్కించుకొని దాసి సుదర్శన్‌గా ప్రసిద్ధుడైన పిట్టంపల్లి సుదర్శన్ (73)సోమవారం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. మిర్యాలగూడకు చెందిన ఆయన ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించారు. అనంతర కాలంలో కళా దర్శకుడిగా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా, రచయితగా, కార్టూనిస్టుగా, పాత్రికేయుడిగా, ఫొటోగ్రాఫర్‌గా ప్రసిద్ధికెక్కారు. ప్రముఖ దర్శకులు బి.నర్సింగరావు తీసిన అనేక చిత్రాలకు సుదర్శన్ కళా దర్శకుడిగా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు. నర్సింగరావు దర్శకత్వం వహించిన 'దాసి' చిత్రం ఐదు జాతీయ అవార్డులను దక్కించుకోగా అందులో సుదర్శన్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా అవార్డు పొందారు. అనంతరం ఆయన జాతీయ అవార్డుల జ్యూరీలో సభ్యులుగా పనిచేశారు.

## అదే ఉత్కంఠ.. అదే సరదా.. అదే నవ్వులు



'సూపర్‌హిట్ చిత్రానికి సీక్వెల్ అంటే.. ప్రేక్షకుల్లో అంచనాలు ఆకాశంలో ఉంటాయి. అందుకోవడం తేలికైన విషయం కాదు. కానీ హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు మల్లిక్‌రామ్, నిర్మాత నాగవంశీ ఆ ఫీట్ చేసి చూపించారు. అందరూ మెచ్చేలా సీక్వెల్ తీసి విజయం సాధించారు. అదే ఉత్కంఠ, అదే సరదా, అదే నవ్వులు.. 'టిల్లు స్క్వేర్'ను బాగా ఎంజాయ్ చేశాను.' అన్నారు అగ్రహీరో చిరంజీవి. ఇటీవలే విడుదలై మంచి వసూళ్లను సాధిస్తూ దూసుకుపోతున్న చిత్రం 'టిల్లు స్క్వేర్'. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన ఈ చిత్రానికి మల్లిక్‌రామ్ దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ చిత్రాన్ని చిరంజీవి ప్రత్యేకంగా వీక్షించారు. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులను ఇంటికి పిలిచి మరీ అభినందించారు. చిరంజీవి ఇంకా మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం పడిన కష్టం గురించి సిద్ధూ నాకు చెప్పాడు. సమిష్టికృషే ఈ విజయానికి కారణం. నటుడిగా, కథకుడిగా, సంభాషణల రచయితగా ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి ప్రధాన కారణమైన సిద్ధు జొన్నలగడ్డను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. మంచి సినిమాలను నిర్మిస్తూ తనదైన శైలిలో దూసుకుపోతూ ఉత్తమ యువనిర్మాతల్లో ఒకరిగా నిలిచాడు నాగవంశీ. ఇది యువతకే కాదు, అన్ని వయసులవారికీ నచ్చే సినిమా' అని చిరంజీవి అన్నారు. చిరంజీవిని కలిసి ఆశీర్వాదం తీసుకున్న వారిలో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు మల్లిక్‌రామ్, నిర్మాత సూర్యదేవర నాగవంశీ, ఎడిటర్ నవీన్ నూలి, రచయిత కల్యాణ్ శంకర్ కూడా ఉన్నారు. ఇప్పటికే ఈ చిత్రం 68కోట్ల వరకూ వసూలు చేసిందని సమాచారం.



## 80వ దశకం నాటి కథ

'దసరా' కాంబో రిపీట్ కాబోతున్న విషయం తెలిసిందే. నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి తెరకెక్కించబోతున్న తాజా సినిమా ప్రకటన ఇటీవలే వెలువడింది. సింగరేణి బ్యాక్‌గ్రౌండ్‌లో సాగిన 'దసరా' కథలో నాని ఊరమాస్ పాత్రలో ప్రేక్షకుల్ని మెప్పించారు. తాజా సినిమా కథ కూడా తెలంగాణ నేపథ్యంలోనే సాగుతుందని, అప్పటి వ్యవస్థపై తిరుగుబాటు చేసిన ఓ యువకుడి కథతో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల స్క్రిప్ట్ సిద్ధం చేశాడని అంటున్నారు. మొత్తంగా ఓ మాస్ లీడర్ కథ ఇదని సమాచారం. సినిమా ప్రకటన సందర్భంగా రిలీజ్ చేసిన ప్రీలుక్ పోస్టర్‌లో నాని మాస్ అవతారంలో కనిపించారు. ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది.